

ఎనిమిది తరగతులు..

ఇద్దరే ఉపాధ్యాయులు


నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత

స్కూల్లో ప్రస్తుతం 88 మంది విద్యార్థులు

కుంటుపడుతున్న చదువులు 7



మెదక్‌లో ర్యాలీ..



జహీరాబాద్‌లో సామూహిక వివాహాలు..

ఘనంగా మిలాద్-ఉన్-నబీ

మిలాద్-ఉన్-నబీని గురువారం మెదక్, జహీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మెదక్‌లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. జహీరాబాద్‌లోని ఈద్గా వద్ద 7 నిరుపేద జంటలకు వివాహం జరిపించారు. నూతన వధూవరులకు సామగ్రి, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

-జహీరాబాద్/మెదక్ కల్చరల్

ఖననం చేసిన 12 రోజుల తర్వాత

45 రోజుల బాలుడికి పోస్టుమార్టం

డెంగ్యూ అని చెప్పిన వైద్యులు

హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి

వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని తండ్రి ఫిర్యాదు

హత్నూర, సెప్టెంబరు 19: 45 రోజుల బాలుడికి డెంగ్యూ సోకిందని వైద్యం అందించారు. పరిస్థితి విషమించిందని చెప్పడంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా చిన్నారి చనిపోయాడు. అప్పట్లో ఖననం చేసిన కుటుంబ సభ్యులు తర్వాత వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 12 రోజుల తర్వాత చిన్నారి మృతదేహాన్ని వెలికి తీసి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాలకు చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల కుమారుడు దత్విక్ (45 రోజులు)కు తీవ్ర జ్వరం రావడంతో ఈ నెల 5న సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు డెంగ్యూ ఉందని మూడు రోజుల పాటు వైద్యం చేశారు. 8వ తేదీన చిన్నారి పరిస్థితి బాగాలేదని హైదరాబాద్‌కు తీసుకు వెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు బాలుడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే చిన్నారి చనిపోయినట్లు నిర్ధారించారు. రోదిస్తూ బాలుడి మృతదేహాన్ని ఖననం చేసిన తండ్రి ఈ నెల 13న సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రిపై సంగారెడ్డి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం బాలుడి మృతదేహాన్ని బయటకు తీయించి సంగారెడ్డి వైద్య కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ వేణుగోపాలరావు, దీపక్, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఇతర అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐ నర్సింలు, డిప్యూటీ తహసీల్దార్ దావీద్, ఆర్‌ఐ శ్రీనివాస్, రెవెన్యూ పోలీసు సిబ్బందితో పాటు గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్

సంగారెడ్డి జిల్లాను నంబర్‌వన్‌గా నిలుపుదాం

- 'దిశ' సమావేశంలో ఎంపీలు
- ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చ

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 19: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సక్రమంగా అమలు చేస్తూ సంగారెడ్డి జిల్లాను నంబర్‌వన్‌గా నిలుపుదామని జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ సభ్యులు సురేష్‌కుమార్ షెట్కార్, ఎం.రఘునందన్‌రావులు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ వల్లూరు క్రాంతి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా మైనింగ్, వ్యవసాయం, వైద్యారోగ్యం, గృహ నిర్మాణం, స్త్రీ శిశు సంక్షేమం, డెయిరీ డెవలప్‌మెంట్, జిల్లా సహకార, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, సివిల్‌సప్లయ్, మెప్మా తదితర శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయడంలో అధికారుల పాత్రే కీలకమన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చ

జిల్లా అభివృద్ధి, కోఆర్డినేటర్ మానిటరింగ్ సమావేశంలో వివిధ సమస్యలపై, ప్రభుత్వ శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతుంటే మీరేం చేస్తున్నారంటూ కమిషనర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు భూమిలో నిర్మించిన ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయిస్తూ అడ్డంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. అమీన్‌పూర్, తెల్లాపూర్ కమిషనర్లు సమావేశానికి గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని సూచించారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో డంపింగ్‌యార్డు, స్లాటర్‌హౌజ్‌లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరారు. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయాలని, కోచ్‌లను నియమించాలని కోరారు.

చెరువులో మునిగి

యువకుడి మృతి

6లో

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి

'సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కీలకమైన పారాసెటమాల్, నొప్పుల ఇంజక్షన్లు(డైక్లోఫినాక్), జలుబు, దగ్గుకు సంబంధించిన లివోసిట్రిజిన్, డైక్లోఫినాక్ టాబ్లెట్లు, 2ఎంఎల్, 5ఎంఎల్ సిరంజీల కొరత ఉంది. ఐ డ్రాప్స్ కూడా లేవు. సంగారెడ్డిలోని మార్క్సనగర్ యూపీహెచ్‌సీలోనూ డైక్లోఫినాక్‌తోపాటు జలుబును తగ్గించే మందులు లేవు.'

'మెదక్ జిల్లా ఆసుపత్రిలో డైక్లోఫినాక్ ఇంజక్షన్ లేకపోవడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ తన పరిధిలో ఉన్న బడ్జెట్‌తో స్థానిక ఏజెన్సీలో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఇంజక్షన్‌ను సర్జరీలతోపాటు నొప్పుల తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి వినియోగిస్తారు. ఈ ఇంజక్షన్ చాలా అత్యవసరమైనది.'

'సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పారాసెటమాల్ ఐవీ, రాంటాక్, ప్యాన్‌టాప్ ఇంజక్షన్ల కొరత ఉంది. అదేవిధంగా డైక్లోఫినాక్ టాబ్లెట్లు అందుబాటులో లేవు. ప్రస్తుత సీజన్‌లో పారాసెటమాల్‌తోపాటు అత్యవసరమైన ర్యాన్‌టాక్, ప్యాన్‌టాప్‌లను రోగులకు సరిపడా సరఫరా చేయాల్సిన అవసరం ఉంది.'




ఓ పక్క వైరల్ జ్వరాలు.. మరోపక్క ఒంటినొప్పులతో ప్రజలు మంచంపడుతున్నారు. ఎవరిని కదిలించినా అనారోగ్య సమస్యలే వల్లెవేస్తున్నారు. మరణించిన వారు కూడా లేకపోలేదు. డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా తదితర వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రోగాలను నయం చేసుకుంటుండగా... ఆ స్థోమత లేనివారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు లేక బాధితులు ఇబ్బంది పడుతున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

మందుల్లేవు...

వైద్యారోగ్య శాఖ మంత్రి ఇలాకాలో..

- ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వాస్పత్రుల్లో లోటు
- డైక్లోఫినాక్ ఇంజక్షన్లు, టాబ్లెట్ల కోసం ఎదురుచూపు
- లివోసిట్రిజన్, పారాసెటమాల్, అజిత్రోమైసిన్ అవసరమే
- రోగాల సీజన్‌లో సరిపడా మందుల్లేని వైనం
- పలుచోట్ల ప్రైవేట్ ఏజన్సీల్లో కొనుగోలు



వానాకాలం సీజన్‌లో వైరల్ ఫీవర్లు, జలుబు, దగ్గు సోకుతుంటాయి. జ్వరాలు తగ్గినా ఒళ్లునొప్పులు ఇబ్బందిపెడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో జ్వరానికి పారాసెటమాల్, జలుబుకు లివోసిట్రిజన్, ఒళ్లునొప్పులకు డైక్లోఫినాక్ ఇంజక్షన్లు, టాబ్లెట్లను డాక్టర్లు ఇస్తుంటారు. కానీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైక్లోఫినాక్ ఇంజక్షన్ల కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తున్నది. పారాసిటమాల్, లివోసిట్రిజిన్ మందులు సైతం సరిపడా లేవని వైద్యులే చెబుతున్నారు. కొరత ఉన్నా త్వరగానే సరఫరా చేస్తున్నారని, పెద్దగా సమస్యలు తలెత్తడం లేదని అంటున్నారు.

మంత్రి దృష్టిపెట్టాలి

వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పలుమార్లు ఆయన ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల పనితీరుపై దృష్టిసారించారు. అయితే గతంలోనూ మందుల కొరత వచ్చినప్పటికీ తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మళ్లీ మందుల కొరత తెరమీదకొస్తున్నది. కొన్ని ఆస్పత్రుల్లో 3 నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉండగా, ఇంకొన్నిచోట్ల మందులు ఎప్పుడు నిండుకుంటాయో తెలియని దుస్థితి నెలకొంది. అందుకే రోజువారీ చార్ట్ ఆధారంగా పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమయ్యే మందులను 3నెలలకు సరిపడా సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ ఒక్క మెడిసిన్ లేకున్నా వాటి కోసం మళ్లీ ప్రైవేట్ మందుల దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితులపై మంత్రి దృష్టిపెట్టాలని.. శాశ్వతంగా మందుల కొరత రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికంగా విన్నవిస్తున్నారు.

అక్కడక్కడా కొరత

- రామాయంపేట ఏరియా ఆసుపత్రిలో 2 నెలలుగా డైక్లోఫినాక్ మెడిసిన్‌ను సరఫరా చేయడం లేదు.
- పాపన్నపేట పీహెచ్‌సీలో అజిత్రోమైసిన్, పిరోజోలిడిన్, సిప్రొఫ్లాక్సిన్ మందుగోలీలు అందుబాటులో లేవు.
- కౌడిపల్లి సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో డైక్లోఫినాక్ మినహా మిగితా మందులు ఉన్నాయి.
- వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లివోసిట్రిజిన్, బీ-కాంప్లెక్స్ మందులు 200 మందికి మాత్రమే సరిపడా ఉండగా మిగితా మందులున్నాయి.
- చిన్న శంకరంపేట పీహెచ్‌సీలోనూ డైక్లెఫెనాక్ ఇంజక్షన్ కొరత ఉంది.
- కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డైక్లోఫినాక్ ఇంజక్షన్లు అందుబాటులో లేవు.
- తొగుట పీహెచ్‌సీలో గత 15 రోజులుగా డైక్లోఫినాక్ ఇంజక్షన్‌లు అందుబాటులో లేవని వైద్యులు చెప్పారు.
- రాయపోల్ పీహెచ్‌సీలో లివోసిట్రిజన్ టాబ్లెట్ల కొరత ఉంది.

బదిలీ అయినా.. పాత చోటే..!

- మెదక్ జిల్లాలో 270 మంది ఉపాధ్యాయుల నిరీక్షణ
- డీఎస్సీ నియామకాల వరకు ఇక్కడే!
- నిబంధనల మేరకే అంటున్న అధికారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 19: ఏళ్లుగా బదిలీల కోసం ఎదురుచూసిన కొంతమంది ఉపాధ్యాయులకు ఇంకా నిరాశే ఎదురవుతోంది. 2016 తర్వాత సర్కార్ ఇటీవలే బదిలీల ప్రక్రియ చేపట్టింది. చాలామంది ఉపాధ్యాయులు 9 నుంచి 10 ఏళ్లుగా మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి పలుమార్లు బదిలీలు చేపట్టాలని విన్నవించగా కొత్త సర్కారు స్పందించింది. అయితే, బదిలీ అయిన పలువురిని ఇంకా రిలీవ్‌చేయకపోవడంతో వారంతా పాత చోటే విధులు నిర్వహించాల్సి వస్తోంది. జిల్లాలో 183 బడులు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీరిని రిలీవ్ చేస్తే ఆ పాఠశాలలు మూతపడతాయనే ఉద్దేశంతో అక్కడే విధులు నిర్వర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 270 మంది ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు.

రిలీవ్ కావాల్సిన వారు వీరే..

మెదక్ జిల్లాలో రిలీవ్ కాని ఉపాధ్యాయులు మొత్తం 270 మంది ఉన్నారు. మండలాలవారీగా కౌడిపల్లి 22, రామాయంపేట 19, హావేళీఘణపూర్ 18, నిజాంపేట 18, పాపన్నపేట 17, కొల్చారం 17, మెదక్ 15, నర్సాపూర్ 14, పెద్దశంకరంపేట 14, చిన్నశంకరంపేట 14, శివ్వంపేట 13, టేక్మాల్ 13, వెల్దుర్తి 13, తూప్రాన్ 12, మనోహరాబాద్ 12, నార్సింగి 10, చేగుంట 9, అల్లాదుర్గం 8, మాసాయిపేట 6, చిలప్‌చెడ్ 5, రేగోడ్ 3 మంది ఇంకా రిలీవ్ కాలేదు.

ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి దారుణంగా ఉంది. జిల్లాలో మొత్తం 4021 ఉపాధ్యాయ పోస్టులుండగా.. 3366 మంది టీచర్లు పనిచేస్తున్నారు. 655 పోస్టుల ఖాళీగా ఉన్నాయి. ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు 11 ఉండగా.. ఏకోపాధ్యాయ బడులు 183 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య లేక మూతపడ్డ బడులు 24 ఉండడం గమనార్హం. అయితే ఉపాధ్యాయులు లేని బడులకు గత నెలలో విద్యార్థులు సంఖ్యకు మించి ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. కాగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఇటీవల ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించింది. ఫలితాలు వెలువడాల్సి ఉన్నాయి. వారి నియామకాలు జరిగేంత వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసే అవకాశం లేదు. ఈ ప్రక్రియ మరో రెండు నెలల పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు వీరు అదే బడిలో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

-చల్లా లక్ష్మణ్, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను డీఎస్సీ ద్వారా త్వరగా భర్తీ చేయాలి. ఏళ్లుగా ఒకే పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టింది. అయినప్పటికీ వారి పాత చోట పని చేయిస్తున్నారు. వెంటనే ఆ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి.

డీఎస్సీ ఫలితాలు వస్తే జిల్లాకు 200 మంది

-రాధాకిషన్, మెదక్ డీఈవో

ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో కొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్నవారని రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం ఇంకా రిలీవ్ చేయలేదు. డీఎస్సీ ఫలితాలు వస్తే.. జిల్లాకు కొత్తగా 200 మంది ఉపాధ్యాయులు వస్తారు.



మోడల్ స్కూళ్లల్లో ఉపాధ్యాయ ఖాళీలు

- బదిలీల్లో 120 మందికి స్థానచలనం
- పలు పాఠశాలల్లో కొత్తగా ఎవరూ చేరని వైనం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19 : తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల 11 ఏళ్ల బదిలీల నిరీక్షణకు తెరపడింది. ఇటీవల జరిగిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలతో సుమారు 120 మందికి స్థానచలనం కలిగిందని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మోడల్‌స్కూళ్లను ప్రారంభించింది. అప్పటి నుంచి వాటిలో బోధించే ఉపాధ్యాయులు ఒకే చోట విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు. పదకొండేళ్లుగా స్థానచలనం లేకుండా ఉండటంతో బదిలీలు చేపట్టాలని ఎన్నో సార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఎట్టకేలకు వారి బదిలీలకు మోక్షం కలిగింది.

190 పోస్టులకు ప్రస్తుతం 131 మంది

సంగారెడ్డి జిల్లాలో 10 మోడల్ స్కూళ్లలో 190 ఉపాధ్యాయ పోస్టులకు ప్రస్తుతం 131 మంది పనిచేస్తున్నారు. 37 పీజీటీలు, 22 టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజా బదిలీల అనంతరం జిల్లాలోని మొగ్గి మోడల్ స్కూల్‌లో 10 పీజీటీ, ఆరు టీజీటీ పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం అక్కడ ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారు. రాయికోడ్‌లో ఎనిమిది, ఝరాసంగంలో 7 పీజీటీ పోస్టులు ఖాళీ అయ్యాయి. పది స్కూళ్లలో 9 మంది రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు పనిచేస్తుండగా, రాయికోడ్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విధులు నిర్వహిస్తున్నారు. పలు మోడల్‌స్కూళ్లల్లో ఉపాధ్యాయులులేని కారణంగా ఇప్పటి వరకు హెచ్‌బీటీ (హవర్లీ బేస్‌డ టీచర్)లతో నెట్టుకొచ్చారు. తాజాగా ఏర్పడ్డ ఖాళీలతో మళ్లీ హెచ్‌బీటీల నియామకాలు తప్పవని విద్యాశాఖవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సహకారం అస్తవ్యస్తం

అక్రమాలకు నిలయాలుగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు

- వెలుగుచూస్తున్న అవకతవకలు
- ఆర్డీవో విచారణలో వెల్లడి
- టేక్మాల్ సొసైటీ సీఈవో సస్పెన్షన్

మెదక్/టేక్మాల్, సెప్టెంబరు 19: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అక్రమాలకు నెలవుగా మారాయి. పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సొసైటీ సభ్యుల ఇష్టారాజ్యం నడుస్తోంది. జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 37 సొసైటీలు ఉన్నాయి. ఈ సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలు, రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. ఆదాయం కోసం పెట్రోల్ బంకుల నిర్వహణకు కూడా ప్రభుత్వం సహకరిస్తున్నది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నది. ఆదాయం కోసం చేసే ఆయా కార్యకలాపాల్లో నష్టాలు వస్తున్నాయని లెక్కల్లో చూపుతూ.. సిబ్బంది, సభ్యులు రూ.లక్షల్లో నొక్కేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా టేక్మాల్ ప్రాథమిక పరపతి సహకార సంఘంలో వచ్చిన ఆరోపణలపై అధికారులు స్పందించి విచారణ జరిపించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారీగా అక్రమాలు వెలుగుచూడడంతో సొసైటీ సీఈవోను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆది నుంచి ఆరోపణలే..

టేక్మాల్ పీఏసీఎస్ పరిధిలో ధనూర గ్రామంలో 2020లో పెట్రోల్‌బంకు ఏర్పాటు చేసేందుకు భూమిని 25 సంవత్సరాలకు లీజులకు తీసుకున్నారు. ఇందుకు భూయజమానికి నెలకు రూ.10 వేలు అద్దె చెల్లించినట్లు రికార్డుల్లో రాసుకున్నారు. ఈ బంకును కేవలం ఆరు నెలలు మాత్రమే నడిపి నష్టాల పేరిట మూసివేశారు. పెట్రోల్‌బంకు నడపడం మూలంగా రూ. 13 లక్షలు నష్టం వచ్చినట్లు సొసైటీ పుస్తకంలో రాసుకున్నారు. గతంలో సొసైటీ అభివృద్ధి కోసం చిలకమర్రి కుటుంబీకులు 2.12 ఎకరాలు దానంగా ఇచ్చారు. కానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. ఆ భూమి రికార్డుల్లో వారి వారసుల పేరిట ఉండడంతో సమస్య ఎదురైంది. పరిష్కారం కోసం స్థానిక నేతలు, ప్రజల జోక్యంతో వారసులతో రూ.3 లక్షలకు సెటిల్‌మెంట్ చేసుకుని సొసైటీ పేరిట గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సొసైటీ పెద్దలకు సూచించారు. 2018 సంవత్సరంలో 2.12 ఎకరాలు సొసైటీ సీఈవో పేరిట రిజిస్టర్ అయ్యింది. కానీ భూవారసులకు చెల్లించింది రూ.3 లక్షలు కాగా, రిజిస్టర్‌లో రూ.27.84 లక్షలు చెల్లించి భూమి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తతంగంలో లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. సొసైటీ నిర్వహణలో ఇన్ని అవకతవకలు జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రికార్డులను సరిగ్గా ఆడిట్ చేయకపోవడంతోనే అక్రమాలు బయటకు రావడంలేదనే రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇటీవల పలువురు రైతులు కలెక్టర్‌కు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రమాదేవి ప్రాథమిక విచారణ నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదికలో పేర్కొన్న వివరాలమేరకు డీసీవో కరుణ సొసైటీ సీఈవో వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



టేక్మాల్ పీఏసీఎస్ కార్యాలయం

తహసీల్దార్ సస్పెన్షన్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 19: విధులకు సక్రమంగా హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రేగోడ్ తహసీల్దార్ బాలలక్ష్మిని సస్పెండ్ చేస్తూ మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మెదక్ ఆర్డీవో రమాదేవి గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11:45 దాటినా తహసీల్దార్ బాలలక్ష్మి విధులకు హాజరుకాలేదు. తరచుగా విధులకు గైర్హాజరుకావడం లేదని, అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆర్డీవోతో మొరపెట్టుకున్నారు. ప్రజల నుంచి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన ఆర్డీవో రమాదేవి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. గతంలోనూ పలుమార్లు హెచ్చరించినా తీరుమార్చుకోకపోవడంతో తహసీల్దార్ బాలలక్ష్మిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

గీతమ్‌లో నాడీ వ్యవస్థపై వెబినార్

పటాన్‌చెరు, సెప్టెంబరు 19: 'గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో నాడీ వ్యవస్థ ఆధ్యాత్మికత: ఒత్తిడిని అధిగమించే రహస్య ఆయుధం' అంశంపై గురువారం వెబినార్ నిర్వహించారు. పంజాబ్‌కు చెందిన ఎనర్జీ వెల్‌నెస్ పర్పస్ కోచ్ లిప్పీ భల్లా, డాక్టర్ నవీన్‌కుమార్ కొట్టాకిలు వెబినార్‌లో మాట్లాడారు. ఒత్తిడిని అధిగమించడం, మానవులు, వ్యవహార సరళిపై నాడీ వ్యవస్థ ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ గటాడి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడ్డు జారి కిందపడి వ్యక్తి మృతి


యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 19: పొలం వద్దకు ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నిద్రబోయిన యాదగిరి (41) తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. ఓ రైతు పొలం ఒడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కాలు జారి వరి పొలంలో పడ్డాడు. బురదలోకి ముఖం దూరుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. యాదగిరి మధ్యాహ్నం దాటినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా వరి పొలంలో పడి విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య అంజమ్మ, కూతరు భూమిక ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యాల్‌కల్‌లో మైనింగ్ అధికారుల దాడులు

● లారీ, రాయికోత యంత్రాల సీజ్


ఎర్రరాయిని లారీని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

న్యాల్‌కల్, సెప్టెంబరు19 : అక్రమంగా చేపడుతున్న ఎర్ర రాయి తవ్వకాలపై గురువారం దాడులుచేసి రెండు కోత యంత్రాలను, ఎర్రరాయిని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. వారి కథనం ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గణేష్‌పూర్ ఎర్రరాయి గనులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు కోత యంత్రాలు, ఎర్రరాయిని తరలిస్తున్న లారీని సీజ్‌చేశారు. ఈ దాడుల్లో మైనింగ్ ఆర్‌ఐ సాయిరాం, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ దారుణ హత్య!

● పోలీసుల అదుపులో నిందితులు


లలిత(ఫైల్)

మాసాయిపేట సెప్టెంబర్ 19: ఉపాధిహామీ డబ్బుల కోసం వెళ్లి అదృశ్యమైన గిరిజన మహిళ దారుణ హత్యకు గురైనట్లుగా తెలుస్తోంది. తండావాసుల వివరాల ప్రకారం మాసాయిపేట మండలం సాజు గిరిజన తండాకు చెందిన మాలోత్ లలిత(48) ఈ నెల 11న ఉపాధి హామీ డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అయితే లలిత హత్యకు గురైనట్లు గురువారం సాజు తండావాసులు తెలిపారు. బంగారు నగల కోసం హత్య జరిగినట్లు... నిందితులు భార్యభర్తలిద్దరూ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై చేగుంట పోలీసులను సంప్రదించగా పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమలో కార్మికుడు మృతి

● చోరీ చేసి, ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఫిర్యాదు


జనార్దనరావు మృతదేహం

పటాన్‌చెరు, సెప్టెంబరు 19 : విధి నిర్వహణ కోసం పరిశ్రమకు వెళ్లిన కార్మికుడు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య ఆరా తీయగా పరిశ్రమలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని యాజమాన్యం చెప్పడం గమనార్హం. బీడీఎల్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, జోగిపాడు గ్రామానికి చెందిన లూకాలపు జనార్దనరావు (45) కొంతకాలంగా చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటూ 14 సంవత్సరాలుగా పాశమైలారం సింతోకెమ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఆర్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విధి నిర్వహణకు వెళ్లిన ఆయన 10 గంటలకు ఇంటికి రావాల్సి ఉండగా రాలేదు. ఓటీ చేస్తున్నాడనుకున్న జనార్దన్‌రావు భార్య విజయ ఉదయం కూడా తన భర్త ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది సాటి కార్మికులను అడగా.. పరిశ్రమలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసింది. ఈ మేరకు బీడీఎల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విజయ తన భర్త మృతిపై అనుమానాలు లేవని పరిశ్రమలో దొంగతనం చేసి బయటకు వస్తున్న సమయంలో స్కూటర్‌లో పరిశ్రమకు చెందిన వస్తువులు దొరకడంతో బిల్డింగ్ పైకి వెళ్లి పిల్లర్‌కి ఆత్మహత్య చేసుకున్నాడు ఫిర్యాదులో పేర్కొనటం గమనార్హం.

పలు అనువనాలు..

కార్మికులు విధి నిర్వహణ ముగించుకుని బయటకు వెళ్లే సమయంలో మాత్రమే ప్రధాన ద్వారం వద్ద కార్మికుడిని తనిఖీ చేస్తారు. రాత్రి పది గంటలకు విధినిర్వహణ ముగించుకుని బయటకు వస్తున్న సమయంలో సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడితే తెల్లవారు ఝామున 4.30 గంటల వరకు యాజమాన్యం అతనిని ఏం చేసింది అన్నది పలు అనుమానాలకు తావిస్తున్నది. రాత్రి పది గంటలకు పరిశ్రమలో కార్మికుడు చోరీ చేస్తే పోలీసులకు అప్పగించాల్సిన యజమాన్యం అలా చేయకుండా పరిశ్రమలోనే ఎందుకు ఉంచింది. అతను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారా ! లేక దాడి చేసి ఏదైనా అఘాయిత్యానికి పాల్పడ్డారా అన్న అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఓటీ చేస్తే ఉదయం ఆరు గంటలకి బయటికి రావాలి. కానీ జనార్దన్ నాలుగున్నర సమయంలోనే ఆత్మహత్య చేసుకున్నట్టు యాజమాన్యం, పోలీసులు చెబుతున్నారు. అంతమంది పనిచేస్తున్న పరిశ్రమలో చోరీకి పాల్పడి దొరికిన వ్యక్తి బిల్డింగ్ పైకి వెళ్లి తాడుతో ఉరి వేసుకుంటుంటే ఎవరు చూడలేదా అన్న అనుమానాలూ లేకపోలేదు. జనార్దనరావు మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక నేతలు డిమాండ్ చేస్తున్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

● గణేష్ నిమజ్జనంలో అపశృతి


మైసన్నగారి నవీన్ (ఫైల్)

చేగుంట, సెప్టెంబరు 19: గణపతి నిమజ్జనోత్సవం ఓ కుటుంబంలో విషాదన్ని నింపింది. ఒక్కగానొక్క కొడుకుని తల్లిదండ్రులకు దూరం చేసింది. ఈ దుర్ఘటన చేగుంట మండలం పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మైసన్నగారి భిక్షపతి, సుగుణ దంపతుల ఒక్కగానొక్క కొడుకు మైసన్నగారి నవీన్ (29) ఈ ఘనటలో మృత్యువాతపడ్డారు. గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఊరేగింపు బుధవారం రాత్రి మొదలవగా.. గురువారం మధ్యాహ్నం చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం స్నేహితులతో కలిసి నవీన్ చెరువులో స్నానానికి దిగి మునిగిపోయాడు. దీంతో, గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా నాలుగు గంటల అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. చేతికొచ్చిన కొడుకు కుటుంబానికి అండగా ఉంటాడనుకుంటే అర్ధాంతరం మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. విషయం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను జయప్రదం చేయండి

నారాయణఖేడ్, సెప్టెంబరు 19: నారాయణఖేడ్‌పరిధిలోని మండలకేంద్రమైన నిజాంపేటలో ఈనెల 30 నుంచి నిర్వహించనున్నజిల్లా స్థాయి రెజ్లింగ్‌పోటీలను జయప్రదం చేయాలని రెజ్లింగ్ పోటీల స్టేట్ పరిశీలకుడు సీనియర్‌పీడీ విఠల్ కోరారు. గురువారం నిజాంపేట తహసీల్దార్‌తో క్రీడల నిర్వహణపై ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతూ అండర్-14 బాలబాలికలకు సంబంధించి 30 కేజీల నుంచి 62 కేజీల వరకు, అండర్ -17 బాలబాలికల విభాగంలో 36 కేజీల నుంచి 73 కేజీల వరకు, అండర్ -14 బాలుర విభాగంలో 35 కేజీల నుంచి 75 కేజీల వరకు, అండర్-17 బాలుర విభాగంలో 41 కేజీల నుంచి 110 కేజీల విభాగాల్లో పోటీలుంటాయని తెలిపారు. జిల్లా పరిషత్‌పాఠశాల ఆవరనలో నిర్వహించనున్న ఈ పోటీల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, శ్రీనివాస్‌రాథోడ్, హరి, దేవిసింగ్, లక్ష్మణ్, భారతీ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం

హై లెవెల్ వంతెన నిర్మాణానికి గ్రహణం

- పది నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని పనులు
- నత్తనడకన సికింద్లాపూర్-దర్గపల్లి వంతెన నిర్మాణం
- వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు తప్పని తిప్పలు



చిన్నకోడూరు మండలం రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



రామునిపట్ల-గోనెపల్లి మధ్య హై లెవెల్ వంతెన కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 : మండలంలోని రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై లో లెవల్ వంతెనతో ప్రతి వర్షాకాలంలో వరద ఉధృతి కారణంగా పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో లో లెవల్ వంతెన స్థానంలో హై లెవల్ వంతెన పాటు గోనెపల్లి వరకు 3 కి.మీల మేర అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు గత ప్రభుత్వం రూ.14.45 కోట్లు మంజూరు చేయగా, గతేడాది అక్టోబరులో శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఇప్పటికీ హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.



సికింద్లాపూర్ - దర్గపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేసిన దృశ్యం (ఫైల్)

వర్షం వస్తే రాకపోకలు బంద్...

వానకాలంలో రామునిపట్ల - గోనెపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు కూడా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేక వరద ఉధృతి తగ్గేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో మండలంలోని గోనెపల్లి, శంకరాయకుంట, ఓబులాపూర్, కస్తూరిపల్లి.. నంగునూరు మండలంలోని రాజగోపాల్ పేట, పాలమాకుల గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్రత్యామ్నాయంగా ఇబ్రహీంనగర్ మీదుగా సుమారు 4 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది.

పూర్తికాని సికింద్లాపూర్- దర్గపల్లి వంతెన పనులు..

చిన్నకోడూరు మండలంలోని సికింద్లాపూర్, నంగునూరు మండలం దర్గపల్లికి వెళ్లే రోడ్డులో వాగుపై సుమారు రెండేళ్ల క్రితం చేపట్టిన హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. రూ.7.15 కోట్లతో పనులను ప్రారంభించగా.. ఇప్పటివరకు 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షానికి వాగు ఉధృతి పెరగడంతో అధికారులు రెండు గ్రామాలకు రాకపోకలు నిలిపి వేయడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. ఈ వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు రామునిపట్ల- గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను సంప్రదించగా ఆయా పనులను చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు



రామునిపట్ల-గోనెపల్లి మధ్య ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న సీపీ అనురాధ (ఫైల్)

యువకుడి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

పుల్‌కల్, సెప్టెంబరు 19: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శంకర్ (21) తండ్రి లింగమయ్య గతంలోనే మరణించగా, తల్లి యశోదతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా తాడ్దానిపల్లి గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద పనిచేసి తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఎప్పటిలాగే బుధవారం విధులకు హాజరై ఇంటికి వచ్చిన శంకర్ రాత్రి గ్రామ శివారులోని పెద్ద చెరువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం తల్లి వెతకగా, చెప్పులు, మొబైల్ ఫోన్ చెరువు కట్టపై కనిపించాయి. స్థానిక మత్స్య కార్మికుల సహాయంతో చెరువులో గాలించగా శంకర్ మృతదేహం లభించింది. ఈ మేరకు పల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శివకుమార్ (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 19: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి మంగాపూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై జరిగింది. పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామానికి చెందిన మన్నే శివకుమార్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఉంటున్న రెండో భార్య దగ్గరికి బుధవారం రాత్రి 11గంటలకు తన ద్విచక్రవాహనంపైన వెళ్తుండగా మంగాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు 108లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి మన్నె యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుభాష్ తెలిపారు.



ముదిరాజ్ సంఘం నాయకులతో సమావేశమైన కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్

పండగ సాయన్న స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

● కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు, సెప్టెంబరు 19: ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ పండగసాయన్న స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిద్దామని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. అక్టోబర్ 21న మహబూబ్‌బాద్ జిల్లా కేంద్రంలో పండగసాయన్న విగ్రహావిష్కరణ, ముదిరాజ్‌ల సింహగర్జన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆ జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం నీలం మధును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికంగా ఎంతో బలవంతులైన ముదిరాజ్‌బిడ్డలకు సరైన అవకాశాలు, ప్రాధాన్యత లభించకపోవడం దురదృష్టకరమన్నారు. హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు గొడుగు శ్రీనివాస్, నీలం దుర్గేష్, చిల్లా సహదేవ్, కాట భాస్కర్, రంజిత్, కరుణాకర్, కొత్తూరు రమేష్, సోమయ్య, పిట్టల. దనుంజయ్, సూరయ్య, వెంకటేశ్వర్లు, మల్లం యాకయ్య వెంకన్న, రాములు, సత్యనారాయణ, ఉప్పలయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఆరేపల్లిలో ఈజీఎస్ పనులను తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. సీనియర్ ఆడిటర్ మాలకొండయ్య ఆధ్వర్యంలో ఆరేపల్లి, మూసాపేట గ్రామాల్లో ఉపాధిహామీ, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాలవారీగా నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఆడిటింగ్ సిబ్బంది శ్రీనివాస్, వంశీకృష్ణ, ముజీద్, అన్సారిఅలీ, ఏపీవో నవాజుద్దిన్, టీఏలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● నగలు, రూ.63 వేలు అపహరణ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 19 : ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చిన్నకోడూరు మండలంలోని రామునిపట్లలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ కథనం గ్రామానికి చెందిన యాసరేణి లక్ష్మయ్యకు, తన భార్య రేణుకకు ఆరోగ్యం బాగలేనందున ఈనెల 16న ఇద్దరూ కామారెడ్డిలోని ఓ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నారు. అనంతరం అక్కడే ఉంటున్న తమ పెద్ద కూతురు ఇంటికి వెళ్లి ఉంటున్నారు. గురువారం ఉదయం లక్ష్మయ్య ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆ ఇంటికి ఎదురుగా ఉంటున్న వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. వెంటనే లక్ష్మయ్య భార్యతో కలిసి స్వగ్రామానికి వచ్చి చూడగా బీరువాలోని తులం బంగారు ఆభరణాలు, 2 తులాల వెండి మొలతాడు, రూ.63 వేలు కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పక్కన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతి చెందిన పొలాస లచ్చయ్య

వర్గల్, సెప్టెంబరు 19 : వర్గల్ మండలం గౌరారం సమీపంలోని సింగాయిపల్లి క్రాస్ రోడ్డు దగ్గరలో ఓ వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం క్రాస్ సమీపంలోని రాజీవ్ రహదారి పక్కన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి రాజన్న సిరిసిల్లా జిల్లా చందుర్తి మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పొలాస లచ్చయ్య (55)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రోడ్డు పక్కనే పెన్సింగ్ వైరు దాటే క్రమంలో కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

జాతీయ రహదారుల పనుల పరిశీలన



తూప్రాన్ వద్ద హైవే పార్కింగ్ ప్రదేశంలో మొక్క నాటుతున్న రీజనల్ ఆఫీసర్ శివశంకర్

తూప్రాన్. సెప్టెంబరు 19 : జాతీయ రహదారి పనులను భారత జాతీయ రహదారుల సంస్థ రీజనల్ ఆఫీసర్ పి.శివశంకర్ పరిశీలించారు. గురువారం ఎన్‌హెచ్ 44పై బోయిన్‌పల్లి నుంచి నిర్మల్ వరకు జరుగుతున్న ఆర్‌వోబీలు, రోడ్డు విస్తరణ, పార్కింగ్ పనులను పరిశీలించారు. అలాగే మెదక్ జిల్లా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద జరుగుతున్న పార్కింగ్ పనులనూ పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జీఎంఆర్ హెడ్ శంకర్ గణేషన్, ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లాలవారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టండి

● ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 19 : ఎస్సీ వర్గీకరణను జిల్లాలవారీగా చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్ర గురువారం సంగారెడ్డికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ నెల 30న యాత్ర ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య, జిల్లా సరిషత్ సభ్యులు మోషస్ రవి, మాదిగ జేఏసీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు మోహన్, అరుణ, వీరేందర్, ఉపేందర్, సురేష్, జోగారావు, సాయన్న, గణేష్, రాంబాబు, జి. రమేష్, వజిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

● దాడిలో పలువురికి గాయాలు.. కేసులు నమోదు

శివ్వంపేట, సెప్టెంబరు 19: వినాయక నిమజ్జనంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి దాడి చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలోని పిల్లుట్ల, బీజిలిపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని పిలుట్ల గ్రామంలో మంగళవారం రాత్రి సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరుగడంతో కేసులు నమోదయ్యాయి. అలాగే బీజిలిపూరులో రెండు వర్గాలు దాడి చేసుకోగా శామిరిపేట హరీష్, మహేష్, సుధాకర్ తలలకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు గ్రామాల్లో ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

గిరిజన వసతి గృహం నిర్వహణ అస్తవ్యస్తం

- విద్యార్థులే అన్నం వడ్డించుకోవాల్సిన దుస్థితి
- కుళ్లిపోయిన గుడ్ల పంపిణీ



శివ్వంపేట, గిరిజన వసతి గృహంలో కుళ్లిన గుడ్లు

శివ్వంపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రమైన శివ్వంపేట గిరిజన వసతి గృహంలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. గురువారం ఉడకపెట్టిన గుండ్లు కుళ్లిపోయి కనిపించాయి. అంతేకాకుండా వసతి గృహంలో సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థులే తోటి విద్యార్థులకు భోజనం వడ్డించే దుస్థితి నెలకొన్నది. కొంత మంది విద్యార్థులకు గుడ్లు పంపిణీలో కోత విధించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందడంలేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వార్డెన్ యాదగిరిని సంప్రదించగా మెదక్ సమావేశానికి వెళ్లానని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.



శివ్వంపేట వసతి గృహంలో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు



కుళ్లిపోయిన మేత తిని మేకలు మృతి

కోహెడ, సెప్టెంబరు 19 : మండలంలోని రామచంద్రపూర్ గ్రామంలో 15 మేకలు గురువారం మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన శాతవేణి మల్లయ్య గ్రామ శివారులోని పొలాలవద్దకు మేకలను మేతకు తీసుకెళ్లగా అక్కడున్న కుళ్ళిపోయిన మొక్కజొన్న బెండు, మక్కలు తిన్నాయి. దీంతో ఆ మేత విషపూరితంగా మారి 15 మేకలు మృతి చెందినట్లు పశు వైద్యుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటాల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఏటీఎం వద్ద మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేస్తున్న ఏటీఎం కార్డులు, నగదు, సెల్‌ఫోన్

తూప్రాన్, సెప్టెంబరు19 : ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేయడం తెలువని అమాయకులను మోసం చేసి కార్డులు మార్చి డబ్బులు డ్రా చేసుకుని పరారీలో ఉన్న ఓ వ్యక్తిని తూప్రాన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం హరియాణా రాష్ట్రానికి చెందిన శాహేద్(44) గురువారం తూప్రాన్ ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకోని విచారించారు. ఈ నెల 8న ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి, 11న ధాతర్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు డబ్బులు డ్రా చేయడం కోసం వచ్చారు. డ్రా చేయడం వారికి తెలియకపోవడంతో చేసి ఇవ్వాలని శాహేద్‌ను కోరగా డ్రా చేసినట్లు నమ్మించి కార్డులను మార్చివేశాడు. ఇస్లాంపూర్‌కు చెందిన వ్యక్తి కార్డు నుంచి రూ.9600, ధాతార్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి కార్డు నుంచి రూ.45వేలు కాజేసినట్లు గుర్తించారు. అలాగే శామీర్‌పేట్‌కు చెందిన వ్యక్తి ఏటీఎం నుంచి రూ. 10వేలు డ్రా చేసినట్లు గుర్తించారు. నిందితుడి నుంచి రూ.45వేల నగదు, సెల్‌ఫోన్, 28 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి షకీల్ పరారీలో ఉన్నాడు. నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురికి రిమాండ్

మనోహరాబాద్, సెప్టెంబరు 19: గౌతోజీ గూడెం గ్రామంలో కుల బహిష్కరణ కేసు విషయంలో 19 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గౌతోజీగూడెం గ్రామానికి చెందిన చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ముగ్గురు పరసబోయిన నర్సయ్య చాపల కృష్ణ, పంచమి పెంటయ్య వ్యక్తులను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి రిమాండ్‌కు తరలించారు.

ఎనిమిది తరగతులు.. ఇద్దరే ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత

కోహీర్, సెప్టెంబరు 19 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడం లేదు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతికి వరకు ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 88 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదట 91 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయులు లేరని ఇటీవలే ముగ్గురు విద్యార్థులు ఇతర పాఠశాలలో చేరారు. ఇక్కడ గత విద్యా సంవత్సరంలో ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులూ ఇటీవల బదిలీ అయ్యారు. అయితే వారి స్థానంలో కేవలం ముగ్గురు ఉపాధ్యాయులనే మాత్రమే నియమించి మరో మూడు పోస్టులను బ్లాక్‌లో పెట్టారు. కేటాయించిన ముగ్గురిలో ఒక ఉపాధ్యాయురాలు తన భర్తకు ఆరోగ్య సమస్య ఉందని, డిప్యూటేషన్ కోసం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు అర్జీ పెట్టుకోగా.. నాగిరెడ్డిపల్లి నుంచి ఆమె కోరిన చోటుకు పంపించారు. ఇక మిగిలిన ఇద్దరిలో ఒకరు ఇప్పటికీ జాయిన్ కాలేదు. దీంతో ఇక్కడి నుంచి బదిలీ అయిన మరో ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయకుండా ఇక్కడే ఉంచారు. ఫలితంగా ఆరుగురికి ఇద్దరు ఉపాధ్యాయులే ఉండడంతో అన్ని తరగతుల విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యాబోధన అందడం లేదు. ఈ విషయమై మండల విద్యాధికారిని వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని, తాను చేసేది ఏమీ లేదని సమాధానం ఇచ్చారు.



అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

సమస్యల కస్తూర్బా

- డ్రైనేజీ దుర్వాసనతో విద్యార్థినులకు అవస్థలు
- మరమ్మతులకు నోచుకోని వాటర్‌ప్లాంట్, సోలార్ వాటర్ హీటర్
- పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న బాలికలు, సిబ్బంది



మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

మద్దూరు, సెప్టెంబరు 19 : బడి మానేసిన, అనాథ పిల్లలు, ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేని బాలికల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాల తరహాలో ఏర్పాటు చేసిన మద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమస్యలతో సతమతమవుతున్నది. తాగనీటి వసతి సరిగాలేక, పారిశుధ్యం లోపించడంతో టీచర్లతో పాటు బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టింపులేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దోమలకు ఆవాసంగా మురుగు..

పాఠశాలలో 6 వ తరగతి నుంచి ఇంటర్ వరకు 221 మంది బాలికలు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. అయితే విద్యార్థినులు వినియోగించిన నీటిని బయటకు పంపే మార్గం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే తీసిన పెద్దపెద్ద గోతుల్లోకి మళ్లిస్తున్నారు. దీంతో అవి మురుగునీటి గుంతలుగా మారి కంపును వెదజల్లుతున్నాయి. దోమలకు ఆవాసాలుగా మారడంతో విద్యార్థినులు విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇక వర్షాకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతున్నదని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు త్రిమాన్ కమిటీ సభ్యులు పాఠశాల పరిస్థితులపై సందర్శించినా సమస్యలకు పరిష్కారం చూపలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఇక మినరల్ వాటర్ ప్లాంటుతో పాటు సోలార్ వాటర్ హీటర్ పాడైనా పట్టించుకునే నాథుడేలేడు. దీంతో మినరల్ వాటర్ బయట నుంచి తెప్పించాల్సిన పరిస్థితి నెలకొన్నది.




కస్తూర్బా పాఠశాల ఆవరణలో తీసిన మురుగు గుంత

పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్యలపై ఇటీవల విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి కస్తూర్బాను సందర్శించినా పూర్తిస్థాయిలో సమస్యలపై దృష్టిసారించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నో బెడ్‌షీట్స్.. నో మటన్..

బాలికలకు ఏడాదికి రెండు జతల యూనీఫామ్స్‌తో పాటు నెలనెలా రూ.100 కాస్మోటిక్ చార్జీలు బాలికల అకౌంట్‌లో ప్రభుత్వం జమచేస్తుంది. అయితే బెడ్‌షీట్స్ అందించడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. వారంలో 5 మార్లు ఎగ్స్ , ఉదయం టిఫిన్స్ సాయంత్రం స్నాక్స్ అందించడంతో పాటు మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల చొప్పున నెలలో 4 సార్లు చికెన్, 2 సార్లు మటన్ అందించాల్సి ఉన్నది. అయితే మటన్ పెట్టడం లేదని, ఈ ఏడాదిలో ఒక్కసారి మాత్రమే మటన్ అందించినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



పాఠశాలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. అదికారులతోపాటు పాఠశాలను సందర్శించిన ప్రజాప్రతినిధులకూ సమస్య వివరించాం. విద్యార్థులకు మటన్‌కు బదులుగా చికెన్ అందిస్తున్నాం. అదికారుల సూచన మేరకు నీళ్ల బయటకు పంపించేందుకు ఏఈ ఎస్టిమేషన్ వేశారు. వాటర్‌ప్లాంట్‌తో పాటు సోలార్ వాటర్ మరమ్మతులు చేపించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. -స్వప్న ఎస్‌వో మద్దూరు

ఓటరు సవరణకు సహకరించండి

● ఎంపీడీవో యాదగిరి
● జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 19: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు సవరణ, కొత్త ఓటర్ల పేర్ల నమోదు ప్రక్రియకు సహకరించాలని ఎంపీడీవో యాదగిరి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులను కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు.

●**కంది:** ఓటరు జాబితాలో మార్పులు ఉంటే 21వ తేదీవరకు తెలపాలని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులను ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై ఆయన వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖాజాఖాన్, మధుసూదన్‌రెడ్డి, మోతీలాల్ నాయక్, ఆనంద్‌రావు, వడ్ల రవి పాల్గొన్నారు.

●**కల్హేర్:** కల్హేర్ ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌లు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఓటరు జాబితాపై మార్పులు ఉంటే తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**నారాయణఖేడ్:** ఓటరు నమోదుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు.

●**కంగ్టి:** కంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సత్తయ్య సమావేశం నిర్వహించారు. ఎంపీవో సుభాష్, వివిధపార్టీల నాయకులు బసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధు, సంతోష్‌పాటిల్, దత్తాత్రి పాల్గొన్నారు.

●**నాగల్‌గిద్ద:** నాగల్‌గిద్ద ఎంపీడీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో ఎంపీడీవో మహేశ్వర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు.



పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న డీపీవో యాదయ్య

●**కోహీర్:** మండల కేంద్రమైన కోహీర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల మండల అధ్యక్షులతో ఎంపీడీవో భారతి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

●**మనూరు:** మనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో ఆలివేలి మంగ పాల్గొని మాట్లాడారు.

మెదక్ జిల్లాలో

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19: గ్రామీణ ప్రాంతాల్లో వార్డులవారీగా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 21లోపు సంబంధిత అధికారులకు తెలియజేయాలని మెదక్ జిల్లా డీపీవో యాదయ్య అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై వివిధపార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

●**అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో ఎంపీడీవో చంద్రశేఖర్ ఓటరు జాబితా సవరణపై సమావేశాన్ని నిర్వహించారు.



సంగారెడ్డి రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరి

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట మండలంలోని పలు రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులను ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను ఎంపీడీవో దామోదర్ అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లక్ష్మారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

●**వెల్దుర్తి:** మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రాజకీయ పార్టీ నాయకులతో ఓటర్ జాబితా సవరణపై ఎంపీడీవో ఉమాదేవి సమీక్షా సమావేశం నిర్వహించారు.

●**చేగుంట:** చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో చిన్నారెడ్డి ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు చింతల భూపాల్, వడ్ల నవీన్, బీజేవైఎం మండలాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●**చిలప్‌చెడ్:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో ఎంపీడీవో ఆనంద్ సమావేశం నిర్వహించారు.

●**తూప్రాన్:** తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో ఎంపీడీవో శేషాద్రి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉప్పగ అశోక్‌గుప్తా, బీఆర్ఎస్, బీజేపీ మండలాధ్యక్షులు బొలంపల్లి బాబులొరెడ్డి, మహేష్‌యదవ్ పాల్గొన్నారు.

పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకోవడానికి విద్యార్థులకు మరిన్ని అవకాశాలు

● కెనడా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ పాండురంగ అశ్రిత్



బీవీఆర్ఐటీలోని సాంకేతిక సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నర్సాపూర్, సెప్టెంబరు 19: విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకోవడం వల్ల మరిన్ని అవకాశాలు వస్తాయని కెనడా యూనవర్సిటీ డీన్ ప్రొఫెసర్ పాండురంగ అశ్రిత్ పేర్కొన్నారు. గురువారం బీవీఆర్ఐటీలో రెండురోజుల పాటు నిర్వహించనున్న సాంకేతిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెమికండక్టర్ల ప్యాకేజింగ్ రంగంలో సంభవిస్తున్న పెనుమార్పులు భారత్‌లో విద్యార్థులకు వరంగా మారబోతుందన్నారు. వేలకోట్ల పెట్టుబడులతో ప్యాకేజింగ్ రంగంలో జరుగుతున్న అభివృద్ధి వేలాదిగా ఉపాధి అవకాశాలు కల్పించబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ విష్ణురాజు, సెక్రటరీ ఆదిత్య, వైస్ చైర్మన్ రవిచంద్రన్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఆర్డీవో

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 19: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మెదక్ డివిజన్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ. శర్దప్ప, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. ఇందులో భాగంగా గురువారం జిల్లా నుంచి ఆరోగ్యశ్రీ ఉద్యోగులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మహేందర్, బన్నాం, రమేశ్, సురేశ్, వినోద్, గాయత్రీ, అశోక్, సంతోష్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 19: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గం ఏకమై ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 23న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంల దేశావ్యాప్తంగా బ్లాక్‌డేను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు బదిలీలు సహజమే: భూపాల్‌రెడ్డి



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 19: అధ్యాపకులకు బదిలీలు సహజమేనని మాజీ ప్రొటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని వి.గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ కళాశాలలో బదిలీ అయిన అధ్యాపకులను, ఉపాధ్యాయులను ఆయన సన్మానించి మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వి.సింధూఆదర్శరెడ్డి, బి.పుష్పనగేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వి.ఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ పాల్గొన్నారు.

ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యం

● డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్, సెప్టెంబరు 19: డ్వాక్రా సంఘంలోని ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళకు నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వచ్చే సుస్థిర జీవనోపాధి కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధులత, ప్రాజెక్టు మేనేజర్ మోహన్, బ్యాంకు మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మిషన్ భగీరథ నీరు సరఫరా



నీటి సరఫరాను పరిశీలిస్తున్న కార్మికుడు

నారాయణఖేడ్, సెప్టెంబరు 19: ఖేడ్ మున్సిపల్‌లోని 8వ వార్డు మన్సూర్‌పూర్‌లోని కొండన్న గుడి పక్క గల్లీలో మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన నాటి నుంచి తాగునీటి సరఫరా జరగలేదు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, అధికారులను అడిగి నీటి సరఫరా కాక పోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. పైప్‌లైన్‌లో కంట్రోల్ వాల్వు లేకపోవడంతో నీటి సరఫరా జరగడం లేదని గుర్తించి గురువారం వాల్వును బిగింపజేసి నీటి సరఫరాను ప్రారంభించారు. ఇన్నేళ్లకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంతో గల్లీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు

● ఆర్యవైశ్య మహాసభ నాయకులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 19: తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చాలనే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజీ అనంత్‌కిషన్‌గుప్తా, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్ ప్రభుగుప్తా, వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్‌గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకోటి దయాకర్‌గుప్తా, జిల్లా కోశాధికారి బొమ్మ చంద్రశేఖర్ గుప్తా, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బెజగం శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం నారాయణఖేడ్‌లోఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి పేరుగా మార్చాలని ఆలోచిస్తుందని, ఈ విషయాన్ని పునరాలోచన చేయాలన్నారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును కూడా ఏదైనా కొత్త ప్రాజెక్టుకు పెట్టి తెలుగు విశ్వవిద్యాలయం పేరు యధావిధిగా ఉంచాలని వారు కోరారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి'

హవేళిఘణపూర్/అల్లాదుర్గం/నర్సాపూర్/వెల్దుర్తి, సెప్టెంబరు 19: రైతులు, ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తసీల్దార్ సిందురేఖ తెలిపారు. గురువారం తసీల్దార్ కార్యాలయంతో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణిని ప్రతీ సోమవారం తసీల్దార్ కార్యాలయంలో నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని అల్లాదుర్గం తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. నర్సాపూర్ మండల పరిధిలో ఆయా గ్రామాల్లో భూసమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రతీ సోమవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని తహసీల్దార్ కృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం: ఎంపీడీవో

కంగ్టి/నారాయణఖేడ్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 19: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కంగ్టిలోని ఐకేపీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్న ప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుభాష్, సూపర్‌వైజర్ ప్రశాంతి పాల్గొన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని చాప్టా.కెలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మెదక్ మండలంలోని ర్యాలమడుగు గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో పోషన్ మాసోత్సవాలు నిర్వహించారు.

ఏచూరి జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం: సీపీఎం

నర్సాపూర్, సెప్టెంబరు 19: సీపీఎం జాతీయ నేత సీతారాంఏచూరి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో గురువారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, నాయకులు చరణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భవానీ సేవాలాల్ దీక్షలు

పుల్‌కల్, సెప్టెంబరు 19: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజనులు భవానీ సేవాలాల్ మహరాజ్ దీక్ష మాలాధరణ చేపట్టారు. విఠల్‌నాయక్ తండాలోని భవానీ సేలాలాల్ ఆలయంలో ఆలిండియా బంజారా లంబాడ జాతీయ శక్తిపీఠ్ సహాయ కార్యదర్శి విఠల్‌మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మాలదారణ చేపట్టారు. 21 రోజులపాటు గిరిజన తండాల్లోని భవానీ సేవాలాల్ మహరాజ్ ఆలయాల భోగ్ బండార్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గోవర్ధన్‌నాయక్, వివిధతండాల పూజారులు, నాయక్, కార్భరిలు పాల్గొన్నారు.

'విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు'

వెల్దుర్తి, సెప్టెంబరు 19: విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని మండల వైద్యాధికారి డాక్టర్ శిరీష హెచ్చరించారు. మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌తండాకు చెందిన ముదియా అనే వృద్ధుడు వైరల్ ఫీవర్‌తో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలో ఇతర రోగులకు ఇబ్బందులు కలుగకుండా పేషెంట్‌తో పాటు ఒక్కరే ఉండాలని చెప్పడంతో ముదియా బంధువు లక్ష్మీ విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సౌజన్యను దుర్భాషలాడారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కనీస పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి

● బీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్ల నర్సింహులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 19: ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) ఇచ్చే కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్ల నర్సింలు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు గురువారం బీఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఎలాంటి ఆధారం లేకుండా జీవనం సాగిస్తున్నారని, 1995లో ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ పెన్షన్ స్కీంలో వారికి ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు.

సమాచారం

వారంలో ఒకరోజు వైద్య సేవలందిస్తాం

జిన్నారం: మాదారంలో వారంలో ఒకరోజు వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి సేవలందిస్తామని పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది తెలిపారు. గురువారం మాదారంలో జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కోమలి వైద్య సిబ్బంది పర్యటించారు.

మున్నూరుకాపు సంఘం బాధ్యుడిగా హనుమంతరావు

శివ్వంపేట: మున్నూరుకాపు సంఘం సంగారెడ్డి జిల్లా బాధ్యుడిగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన కల్లూరి హనుమంతరావు నియమితులయ్యారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కన్వీనర్, అపెక్స్ కౌన్సిలర్ పుట్టం పురుషోత్తంరావు, మాజీ మంత్రి జోగు రామన్న నియామకపత్రాన్ని అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ జువాలజీ, పీజీటీ ఎకనామిక్స్, టీజీటీ మ్యాథమెటిక్స్, టీజీటీ సైన్స్, టీజీటీ సోషల్ పోస్టులకు 21లోపు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు.

'ఎరువును నర్సరీలకు వాడాలి'

చిలప్‌చెడ్: గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లో తయారుచేసే కంపోస్టు ఎరువును నర్సరీలకు, పల్లె ప్రకృతివనాలకు వినియోగించాలని డీఎల్పీవో సాయిబాబా సూచించారు. గురువారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

బావిలో ఉన్న ట్రాక్టర్ వెలికితీత

తూప్రాన్: గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌ను చోరీచేసి బావిలో పడేసిన సంగతి తెలిసిందే. తూప్రాన్ మండలం కిష్టాపూర్‌కు చెందిన ఉడుగుల శ్రీనివాస్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గుర్తు తెలియని దుండగులు తన ట్రాక్టర్, ట్రాలీతో సహా చోరీకి చేసి బావిలో పడేశారు. ట్రాక్టర్ టైర్ల జాడతో బావిలో ఉన్నట్లు గుర్తించారు. గురువారం క్రేన్ సహాయంతో బావిలో పడేసిన ట్రాక్టర్‌ను వెలికితీశారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలి: ఎంపీడీవో

చిన్నశంకరంపేట/పుల్‌కల్/నారాయణఖేడ్, సెప్టెంబరు 19: ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రంలో భాగంగా గురువారం చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఉపాధిహామీలో భాగంగా చేపట్టిన పాంపాడ్ పనులను పరిశీలించారు. పుల్‌కల్ మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం శివలక్ష్మి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎం.దుర్గారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పడమటి యాదగిరి పాల్గొన్నారు. నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అమ్మపేరిట ఒక మొక్క నినాదంతో విద్యార్థులు మొక్కలు నాటారు. తహసీల్ మైదానంలో విద్యార్థులు మానవహారంగా నిల్చొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లిలో ప్రజలకు అవగాన కల్పిస్తున్న ఎంపీడీవో దామోదర్

ఘనంగా మిలాద్-ఉన్-నబీ



నిజాంపేటలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



జహీరాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జహీరాబాద్/నిజాంపేట/జిన్నారం, సెప్టెంబరు 19: మిలాద్ ఉన్ నబీ వేడుకలు సంగారెడ్డి, మెదక్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి డా.చంద్రశేఖర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు. బొల్లారం మున్సిపాలిటీలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఆనందకృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి: తపస్

నారాయణఖేడ్, సెప్టెంబరు 19: డీఎస్సీ నియామకాలు ఆలస్యమౌతున్నందున వీవీలను నియమించి బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేసి, విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని తపస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కమ్మరి దత్తాత్రి కోరారు. గురువారం ఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పటి నుంచో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మల్లికార్జున్, ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, చంద్రశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసమే మృత్యుంజయ యజ్ఞం

ఝరాసంగం, సెప్టెంబరు 19: విశ్వశాంతి, సనాతన ధర్మరక్షణ కోసమే మృత్యుంజయ మంత్ర సహస్ర యజ్ఞం నిర్వహిస్తున్నట్లు బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరిమహరాజ్, మహంత్ డా.సిద్ధేశ్వరానందగిరి మహరాజ్, ఆధ్యాత్మిక సభ్యులు రాచయ్యస్వామి, నీలా వెంకటేశంలు పేర్కొన్నారు. గురువారం దత్తగిరి ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ విశ్వశాంతి, లోక కళ్యాణార్థం మృత్యుంజయ యజ్ఞం వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి: డీఎస్పీ

పటాన్‌చెరు, సెప్టెంబరు 19: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని అబ్దుల్‌కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్, మంజీరా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం డ్రగ్స్ రహిత సమాజంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడంపై పోలీసు విభాగం తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. ఇందుకు పౌరసమాజం నుంచి సహాయం కావాలన్నారు. ఈ సమావేశంలో మంజీరా విజ్ఞాన కేంద్రం సభ్యులు రాజయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కన్వీనర్ అర్జున్, సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల సొసైటీల్లో పనివేళల నిర్ణయంతో ఇబ్బందులు

జహీరాబాద్,సెప్టెంబరు 19: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గురుకుల సొసైటీల్లో పనివేళలను నిర్ణయిస్తూ విడుదల చేసిన జీవో 16తో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని టీఎస్‌యూటీఎస్ రాష్ట్ర నాయకులు రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బూచనెల్లి గ్రామంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పాత పద్ధతినే కొనసాగించాలని వారు కోరారు.

స్టోన్ క్రషర్ పేలుళ్లతో దెబ్బతింటున్న అమరవీరుల స్తూపం



మాదారంలో దెబ్బతిన్న అమరవీరుల స్తూపాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జిన్నారం, సెప్టెంబరు 19: జిన్నారం మండలం మాదారంలో స్టోన్‌క్రషర్ల పేలుళ్ల ధాటికి అమరవీరుల స్తూపం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్టోన్ క్రషర్లు పరిమితికి మించి పేలుళ్లు చేపట్టడంతో స్తూపానికి రాళ్లు తగిలి పగుళ్లు వచ్చినట్లు మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ తెలిపారు. క్రషర్ల అక్రమ బ్లాస్టింగ్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, భగవాన్ సింగ్, విజయ్, సుదర్శన్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.1.30 లక్షలు



వక్రతుండ గణేష్ మండలి నోట్ల దండను, శాలువాను బహూకరిస్తున్న నిర్వాహకులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 19: వినాయక నిమజ్జనం సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలో లడ్డూ వేలంపాటలు పోటీ పోటీగా సాగాయి. పట్టణంలోని నేతాజి గణేష్ మండలి వద్ద రూ.1.30 లక్షలకు దక్కించుకొని యూత్ సభ్యులు మొదటిస్థానంలో నిలిచారు. వీరితో పాటు వక్రతుండ గణేష్ మండపం వద్ద వివిధ వేలంల ద్వారా మొత్తం రూ.5 లక్షలు పలికి రికార్డు సృష్టించారు. ఇక్కడ శాలువానే రూ.70 వేలు పాడి మంగ శ్రీనివాస్‌గౌడ్ దక్కించుకోవడం విశేషం. ఐసీఐసీఐ బ్యాంకు వద్ద గల పంచముఖి గణేష్ మండపం వద్ద వేలంపాటలకుగాను రూ. 2 లక్షలు వచ్చాయి. కోలిగడ్డ యువ నేతాజీ వినాయక మండపం వద్ద తూర్పు చంద్రశేఖర్ రూ.67,770, జంబికుంటలోని మరో మండపం వద్ద రూ.78 వేలు లడ్డూ ధర పలికింది. అలాగే పట్టణంలోని ఫతేనగర్ ప్రగతిస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన శివరాజ్ గణేష్ మండలి వద్ద వినాయకునికి అలంకరించిన రెండు నాణాల దండలను వేలంపాట నిర్వహించారు. ఇక్కడ కేవలం మహిళలకే అవకాశం ఇవ్వడంతో వేలంపాటలో పాల్గొని రూ.20 వేలకు దక్కించుకున్నారు.

ఘనంగా గణనాథుల ఊరేగింపు

రామాయంపేట, సెప్టెంబరు 19: మండల కేంద్రమైన రామాయంపేటతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం గణనాథుల శోభాయాత్ర అట్టహాసంగా సాగింది. గణేష్ విగ్రహాలను అందంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించారు. ఇబ్బందులు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విధులు నిర్వర్తించిన సిబ్బందికి అభినందనలు: ఎస్పీ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 19: మెదక్ జిల్లావ్యాప్తంగా వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వివిధశాఖల సమన్వయంతో జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాల ప్రక్రియ సాగిందన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది: డీఈవో

చేగుంట/వెల్దుర్తి/నారాయణఖేడ్, సెప్టెంబరు 19: క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. చేగుంట మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల నోడల్ అధికారి నీరజ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ముగిశాయి. ఆయా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల నోడల్ అధికారి సీతారామ్ బహుమతులు ప్రదానం చేశారు. నారాయణఖేడ్ పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి క్రీడల్లో ఖేడ్ గురుకులానికి చెందిన పలువురు వాలీబాల్, ఖోఖో, కబడ్డీల్లో ప్రథమ బహుమతులను సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసిన మెదక్ డీఈవో రాధాకిషన్

సంగారెడ్డిలో ఎస్జీఎఫ్ క్రీడలు షురూ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 19: సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలు గురువారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి ఎంఈవో వెంకటనర్సింలు టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. మూడురోజులపాటు ఈ క్రీడలు జరగనున్నాయి. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు.

ప్రజాభవన్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నారాయణఖేడ్/కల్హేర్/ సెప్టెంబరు 19: ఆంక్షలు లేకుండా, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీమంత్రి కేటీఆర్ పిలుపుమేరకు ప్రజాభవన్ ముట్టడికి తరలివెళ్తున్న రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ కంగ్టి మండలాధ్యక్షుడు గంగారాం, ఖేడ్ మాజీ అధ్యక్షులు ప్రభాకర్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ సిర్గాపూర్ మండలాధ్యక్షుడు సంజీవ్‌రావ్‌పాటిల్ ఏఎ్ఎ రవిగౌడ్ అరెస్ట్ చేశారు. రామచంద్రాపురంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వి.ఆదర్శరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం వరకు ఆదర్శరెడ్డి బయటకు వెళ్లనీయకుండా ఎస్ఐ శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిర్బంధించారు.



ఎస్ఐ శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదర్శరెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు